# 28. మనసుల మర్మం

ఉదయ భానుడితోపాటే భానుమూర్తి కూడా వొచ్చి పడ్డాడు. కాని సూర్యకిరణాలకే చలించని సుబ్బారావు, భానుమూర్తి రాకకు చలించకుండటంలో ఆశ్చర్యం ఏముంది? భర్తను నిద్రనుంచి లేపేందుకు భార్య సందేహించింది కాని, భానుమూర్తి మాత్రం సరాసరి పడకగదిలో జొరబడి, బలవంతంగా సుబ్బారావుకు మేలుకొలుపు పాడాడు. విసుక్కుంటూ, బద్ధకంగా నిద్ర లేచిన సుబ్బారావు, భానుమూర్తి మొహం చూడగానే చాలా ఉత్సాహాన్ని కనబరిచాడు. ప్రాణస్నేహితులు మూడేళ్ల తర్వాత కలుసు కోవటమాయె!

కాలకృత్యాలూ, కాఫీ ఉప్మాలూ పూర్తయినవి. సుబ్బారావు భార్య కుశలప్రశ్నలూ అవీ పూర్తిచేసి, ప్రపంచమంతా సుఖంగా వున్నట్లు తృప్తిపడింది. ఇంట్లో పిల్లలు ఎంత గోలచేస్తున్నా యీనాడు సుబ్బారావు విసుక్కోవటం లేదు.

మిత్రుడితో సహా బైటికి బయలుదేరాడు సుబ్బారావు. భోజనానికి త్వరగా రమ్మని భార్యచేసిన హెచ్చరికకు నవ్వుకున్నాడు. కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ, తమకు తెలియకుండానే నది వొడ్డుదాకా వెళ్లారు. ఆకాశంలో దట్టంగా మేఘాలు కమ్ముకున్నవి. వేడిలేని వెలుగులో ప్రకృతి మెరుస్తూ, మైమరిపిస్తోంది. వాన వొచ్చే సూచనలైతే లేవు కాని చాలా ప్రశాంతంగాను, చల్లగాను, హాయిగాను వుంది. గంభీరంగా నిండు చూలాలివలె నడక సాగించే నదీ, వొడ్డుజేరి విరిగే చిన్న చిన్న అలలు, అల్లంత దూరంలో తెప్పల మీద చేపలు పట్టేవాళ్లూ, దూరానవున్న కొండలూ, ఒక అద్భుత దృశ్యాన్ని సృష్టించినవి.

పెద్ద మర్రిచెట్టు మొదట్లో సుఖంగా కూర్చొన్న భానుమూర్తి 'ఇట్లారా-ఇక్కడ కూర్చో' అన్నాడు. సుబ్బారావు వినిపించుకోలేదు. యీ దృశ్యాన్ని చూస్తూ తన్మయు డవుతున్నాడు. కాని అదే దృశ్యం భానుమూర్తికి అంత మనోజ్ఞంగా లేదు మరి!

"రారా ఇట్లారా..."

ఊహల్లోంచి వూడిపడి, సుబ్బారావు భానుమూర్తి పక్కనే కూలబడ్డాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. సుబ్బారావు దృష్టి ఇంకా నదివైపే వుంది. భానుమూర్తి సుబ్బారావును చూస్తూ ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"నేను వొచ్చిన పని వేరు-" అన్నాడు భానుమూర్తి హఠాత్తుగా. గాలిలో తేలుతూన్నట్లున్న సుబ్బారావుకు ధామ్మిన భూమి మీద పడినట్లయింది.

"ఏమిటీ?"

"ఏం లేదు... నీ సంగతే!... యీ మధ్య నీవు చాలా చెడిపొయ్యావని నిన్ను గూర్చిన రకరకాల కథలూ ప్రచార మౌతూన్నవి. ఎవతెనో ఉంచుకున్నావనీ, ఇంటిక్కూడా సరిగ్గా రావటంలేదనీ విన్నాను... ఇదంతా నిజంకాదనీ నీ నోటివెంట వింటే..."

సుబ్బారావు ఆశ్చర్యపోయాడు. కొంతమంది ఎన్ని దుష్కార్యాలు చేసినా పేరురాదు. మరి కొంతమంది ఎంత చిన్న పొరపాటు చేసినా, దుర్భిణిలోవలె కొన్ని రెట్లు పెరుగుతుంది. లేకపోతే, యీ అతిసామాన్య విషయం రెండొందల మైళ్లు ప్రయాణంచేసి, తన మిత్రుణ్ని తోడు తెచ్చుకోవట మేమిటి?

"నీవు విన్నదంతా నిజమే... కాని నేను ఎవర్నీ ఉంచుకోలేదు... ఈ మధ్య ఒకామె, అదే నీలవేణి అని... ఆమెతో స్నేహం కలిసింది!" అన్నాడు సుబ్బారావు.

ఈసారి ఆశ్చర్యపడటం భానుమూర్తి వొంతయింది. క్షణంలో తట్టుకొని నిట్టూర్చి అన్నాడు: "నిజమేనన్నమాట?... ఆ మాట అనేందుకూడా నీకు సిగ్గులేదేం? ముప్పై ఆరేళ్లువొచ్చి, ఐదుగురు బిడ్డల తండ్రివి, నీకీ దుర్బుద్ధి ఏమిటంట?- సిగ్గులేకపోతే సరి..." యీ చర్చ చాలాదూరం లాగుతుం దనుకొన్న భానుమూర్తికి ఆశాభంగమైంది. నేరం బైటబెట్టగానే వొప్పుకునే వాడితో పేచీ ఏముంటుంది?

సుబ్బారావు సిగ్గుపడతాడనుకున్న భానుమూర్తి తాను పొరబడినట్లు గ్రహించాడు. సుబ్బారావు తన తప్పిదాన్ని ఒప్పుకొని, ఏడుస్తూ, ఇక ముందన్నా సక్రమ మార్గంలో వుంటాననడేం? ఏదో మామూలు సంగతి; అదీ తనకు సంబంధం లేనివాళ్ల విషయం విన్నట్లుగా వూరుకుంటాడేం? పోనీ తనతో వాదన వేసుకున్నా ఫర్వాలేదు ... మాట్లాడకుండా వూరుకున్నాడు. అందుకని, ఎలాగైనా తనే వాదన ఆరంభించి, సుబ్బారావుకు గడ్డిపెట్టందే రైలెక్కకూడదని నిశ్చయించుకున్నాడు భానుమూర్తి.

"ఎవరా నీలవేణి?" అన్నాడు.

"ఎవరేమిటి?... బోగందేమో ననుకుంటాను. కుల మేమిటో నేనెప్పుడూ అడగలేదనుకో... పోతే వృత్తిమాత్రం–"

"బజారుసరుకన్నమాట? వ్యభిచారిణి, కులట..."

"ఎవరన్నా కానీ: మనబోటి పెద్దల వల్లనే ఆమె ఈ వృత్తిలో వుందేమో–"

"డబ్బుకు ఆశపడేది, నిన్ను నమ్ముకొని వుంటుందా? ఈ తిరిగేవాళ్ళున్నారే, ఎవరు ఎక్కువ డబ్బిస్తే, వాళ్ళ మీదే ప్రేమ నటిస్తారు."

"కావొచ్చు. అది తప్పేమిటి? ఎక్కడ ఎక్కువ ధర గిట్టితే అక్కడే సరుకు అమ్ముకోవటం వ్యాపార లక్షణం. ఇవన్నీ నాకు తెలియకా?"

సుబ్బారావు ఇలా మొండికేసే తత్వంలో పడ్డాడేం? చిన్నప్పుడు ఎంతో అమాయకంగా ఉండేవాడు. అలాటివాడు ఇలా తయారయ్యాడంటే, ఆ నీలవేణే కారణమై వుండాలి.

"నాకు తెలియక అడుగుతాను– ఆ నీలవేణేం రంభా? ఊర్వశా?..." అన్నాడు భానుమూర్తి. ఎలాగైనా నీలవేణిని నీచపరచటంవల్లనన్నా సుబ్బారావుకు దానిమీద విరక్తి పుడుతుందేమోననే ఆశతో.

"నీలవేణి రంభా?" అని సుబ్బారావు తనను తను మొదటిసారి ప్రశ్నించుకున్నాడు. రంభనైతే తను చూడలేదు కాని, తాను ఎరిగిన అందగత్తెలతో పోలుస్తే, నీలవేణి అందగత్తెగా కూడా జమపడదు.

"కాదు..." అన్నాడు సుబ్బారావు. "ఏదో షుమారుగా వుంటుంది. ఐనా అందచందాల సంగతి నేను అంతగా పట్టించుకోలేదు."

"మరేమిటి? నీ భార్యముందు యీ నీలవేణి దిగదుడుపే నంటావా? లేదా?"

సుబ్బారావు క్షణం ఆలోచించాడు. "ఔను దిగదుడుపే!" అన్నాడు.

"డబ్బుకు డబ్బాపోయి, చేతిలోవున్న రత్నాన్ని చూడకుండా, గాజుపెంకులకోసం తాపత్రయపడటం ఏం సబబుగా వుందీ?" అన్నాడు భానుమూర్తి, తన వాదన బలంగా వుందని లోలోన సంతోషపడుతూ.

సుబ్బారావు మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు. ఇదివరకు తనెన్నడూ ఆలోచించని ప్రశ్నల్ని తను ఎదుర్కోవాల్సి వొచ్చింది. ఇలాంటి అనుమానాలే ఇదివరకు తనకు కలిగివుంటే, జవాబులు సిద్ధంగా ఉంచుకోగలిగేవాడు. సుబ్బారావు మౌనం, భానుమూర్తికి ఉత్సాహకరంగా వుంది.

"ఆలోచించు: బాగా ఆలోచించు. నీకోసం కనిపెట్టుకొని కూర్చునే భార్య ఒకపక్క, నీలవేణికోసం కనిపెట్టుకొని కూర్చునే నీ వొకపక్కా. సహజ ప్రణయం, అనురాగం,

అభిమానం ఒకవైపూ, నటన, కృత్రిమ ప్రణయం, డబ్బుకు ప్రతి వెధవాయికి లభ్యమయ్యే కామానందం మరొకవైపూ - వీటిని తూచి చూస్తే నీకు తెలియకపోదు..."

"యీ వ్యవహారంవల్ల నా కుటుంబ జీవనం చెడిం దనుకుంటున్నావా? నేను భార్యనుకానీ పిల్లల్నిగాని సరిగా చూడటం లేదనా?" అన్నాడు సుబ్బారావు. ఎలాగో అసలు విషయం నుంచి తప్పించుకునేందుకు సుబ్బారావు ప్రయత్నిస్తూన్నట్లు అర్థమైంది.

"కావొచ్చు. కాని నీ కుటుంబానికి కావల్సింది యీ నటన కాదు!"

"నటన ఎందుకవుతుంది? నటన అని ఎలా అనగలవు?"

"అంతగాక ఏమిటి? నీకు నిజమైన అనురాగమే వుంటే, ప్రశాంతంగా ఇంట్లోనే ఉండేవాడివి. ఇలా డబ్బు తగలేస్తూ-"

భానుమూర్తి మాటలకు అడ్డం పడ్డాడు సుబ్బారావు: "నేను ఇంటిపట్టునే పడివుంటే నా అనురాగం నటన అవదు. బైటికి వెళ్తే నటన అయింది! ఎందుకని? పైవాళ్ళకు అలా కనిపిస్తుంటే, ఇంట్లోవాళ్ళకు ఏ బాధా లేదు మరి! ఇక డబ్బంటావా? ఏదో ఉన్నది. తలకు మించిన ఖర్చులేమీ చేయటం లేదు... అటు వెళ్తే ఒక పది రూపాయల ఖర్చు... అదీ రోజూ వెళ్తానా?-"

"అసలెందుకు వెళ్లాలని ఆలోచించవేం? భార్యకన్న తక్కువదాని కోసం ఎందుకు ప్రయత్నం చెయ్యాలి?"

"అంటే, భార్యకన్న అందగత్తె కోసం పరుగెత్తితే నీవింత కష్టపడేవాడివి కాదు. ఆ కారణం "అవినీతి" అనబడేదాన్ని కప్పిపెడుతుందన్నమాట! అంతేనా?"

భానుమూర్తికి జవాబు దొరక్క తన్నుకున్నాడు. వీడింత తెలివిగా ఆలోచించ గలడనీ, మాట్లాడగలడనీ తను అనుకోలేదు.

"అది కాదు..." అన్నాడు భానుమూర్తి నీళ్లు నములుతూ. "నీ కారణం ఏదో అదంతా భ్రమే కాని, నిజం కాదు. నీవు చేసే పాడు పనిని నీకు నువ్వు సమర్థించుకునేందుకుగాను కనిపెట్టిన కారణమై వుంటుంది!"

"నా కిలాటి అనుమానాలు కలగలేదు. ఈ రోజు వరకూ నేనెన్నడూ ఆలోచించలేదు. బుద్ధిమళ్లుతే దానింటికి వెళ్తాను... ఎందుకు వెళ్ళాలి? వెళ్ళకుంటేనేం? మొదలైన ప్రశ్నలు నాకు ఎదురవలేదు..."

"అంటే నీకు నీవు కూడా సమర్థించుకొనే స్థితిలో లేవన్న మాట?... ఇప్పటికీ మించిపోయింది లేదు. ఇప్పుడు ఆలోచించు-"

"ఇదేమంత గొప్ప విషయమనీ దీన్ని గూర్చి తల బద్దలు కొట్టుకోవటం? ... స్థూలంగా చెప్పాలంటే నాకు ఇంట్లో కలగని ఆనందాన్ని దేన్నో నీలవేణి ఇవ్వ గలుగుతోంది. ఏది ఎక్కువ, ఏది తక్కువనే ప్రశ్న కాదు-"

"ఆ ఆనందం ఏమిటి? ఎలాటిది? ఎంత నిర్మలమైనది? ఏదో భ్రమను నిజమనుకొని నిన్ను నీవు మోసం చేసుకుంటున్నావు... తెలిసిందా?"

"పోనీ అదే అను. ఇబ్బంది లేదు. ఈ ఆనందాన్ని గూర్చి చెప్పటం నావల్ల కాదు. అది ఎవరికి వారే అనుభవించి తెలుసుకోవాలి."

"ఏడ్చినట్లే వుంది... నీ ఉద్దేశ్యం నాకేమీ అర్థంకాదని, అర్థమవాలంటే నీలాగే పెడతోవలు పట్టమనా?"

"అది నీ ఇష్టం! బలవంత మేముందీ?... ఐదుగురు పిల్లల్తో, చాకిరీ చెయ్యలేక విసుగెత్తుతూ, ఆరోగ్యం లేకుండా నానా బాధలు పడే భార్యను నేను గౌరవిస్తున్నాను. ఆమెను బాధించకుండా, ఆమె ఇవ్వలేని ఆనందాన్ని బలవంతంగా పిండుకోకుండా వొదిలేస్తున్నాను... నేను నీలవేణి పొత్తు కోరటం ఒక విధంగా భార్యకు తగినంత విశ్రాంతి నివ్వటమే! ఒక విధంగా నీలవేణి మా ఆవిడకు అసిస్టెంట్. అధికారం వుంది కదానని, చాలామంది పెద్ద మనుషుల్లాగు బలవంతాన అదే పనిగా పిల్లల్ని కనిపించ దలచలేదు. ఇందులో బాధ ఎవరికీ? నా భార్యకా లేదు; నాకు అంతకన్నా లేదు; నీలవేణికి అసలే లేదు... పోతే పైవాళ్లకు దేనికి?"

"నీ మేలు కోరేవాణ్ని కనుక చెపుతున్నాను. నాకు పొయ్యేదేమిటి? పెద్దమనిషిగా బతకటం కష్టమే కావచ్చు. కాని దానికోసం ప్రయత్నించటం తప్పు కాదు కదా?" అన్నాడు భానుమూర్తి.

"ఇంత లోతులకు వెళ్ళి ఆలోచిస్తే, ఆ వొత్తిడికి జీవితంలోని సారమంతా పోయి పిప్పి మిగులుతుంది! దారిలో దొరికినదాన్ని అనుభవించకుండటం, దొరకనిదాని కోసం విచారిస్తూ కూర్చోవటం నా వల్ల కాదు. ఆలోచనలకు అంతెక్కడా? నీవు ఆలోచించుకోలేని వాటిని, నీ కోసం ఇతర్లు ఆలోచించి చెపుతుంటే శరీరమంతా తూట్లు పడుతూన్నట్లు వుంటుంది. ఎంత సాఫీగా జీవితం సాగుతుందో, జీవితంనుంచి ఎంత పిండుకునేందుకు అవకాశం వుందో దాన్ని వొదలలేను. ఆలోచిస్తూ కూర్చోవటంకన్న, అనుభవించి పూర్తిచేస్తే సరిపోతుంది" అన్నాడు సుబ్బారావు.

క్షణంసేపు భానుమూర్తి దిమ్మెరపొయ్యాడు. సుబ్బారావు వేదాంతం నసాళానికి అంటింది. ఇదీ ఒక రకం వేదాంతమే అవుగాక– దీన్ని ఒప్పుకోవటం ఎట్లా? తను ఒప్పుకోక పోయినందువల్ల సుబ్బారావుకు పొయ్యేదీ లేదు. కాని, తన యీ రాయబారం నిష్ప్రయోజనమౌతుంది. చూస్తూ చూస్తూ స్నేహితుణ్ని రక్షించలేని అసమర్థతకు తను బాధపడతాడు. తన బాధలకు తోడు, ఇతరుల బాధల్నికూడా కోరి నెత్తిన వేసు కుంటున్నాడు; ఇది ఎవరికైనా కొన్ని సందర్భాల్లో తప్పదేమో?

సుబ్బారావు "మూడ్" అంతా మారిపోయింది. ఇంతకుముందు ప్రశాంతంగా పారేనది, ఉరుకులు పరుగుల్తో ప్రమాదాన్ని సూచించేట్లుగా తనమీదికే ప్రవహిస్తూన్నంత

బాధ కలిగింది. ఆకాశం మెల్లిమెల్లిగా, మేఘాల బరువుకు భూమిమీదికి వాలుతూన్నట్లు, ఆ బరువంతా తన తలమీదనే పడుతుందేమో నన్నంత భయం కలిగింది. ఈ ప్రకృతి రామణీయకత అంతా ఆనందాన్ని విషాదంలోకి మార్చేందుకు ప్రయత్నించి, కొద్దిసేపట్లోనే విజయాన్ని సాధించింది... కాని ఇది ప్రకృతి శక్తి కాదేమో? నిజానికి ప్రకృతిలో తన కళ్లెదుట జరిగిన మార్పేమీ లేదు. అదంతా తన మనస్సు పొందే అనుభూతి తాలూకు "మూడ్" వల్లనేకాని, బైటి ప్రపంచంలోది కాదు ... నీలవేణి విషయంలోకూడా ఆమె అందచందాలూ, రసికత్వం మొదలైన వాటికన్న తన మనస్సు కలిగించే ఉత్సాహము, తను వున్న "మూడ్" కారణాలే కావొచ్చు. ఈ "మూడ్"ను కంట్రోల్ చేస్తూ, మార్చేందుకు ప్రపంచంలోని అనేక వస్తువులూ, విషయాలు, ఆలోచనలూ కారణమై ఉండొచ్చు... యీ కారణాన్ని భానుమూర్తికి అర్థమయేట్లు చెప్పటం కష్టం. తనకు తను చెప్పుకోవటమే చేతకావటంలేదు!

"అదంతా అలా ఉంచు - ఐందేమో ఐంది. ఇకనైనా ఆ నీలవేణి దగ్గిరికి పోకుండా ఉంటానని ప్రమాణం చెయ్యి!" అన్నాడు భానుమూర్తి.

"ఎందుకొచ్చిన ప్రమాణాలు? నా బుద్ధిని నేను నమ్మే స్థితిలో లేను. ఇప్పుడు ప్రమాణం చేసి, దాన్ని అతిక్రమించటంకన్న, ప్రమాణమే చేయకుండటం మంచిది కదా!... దీనివల్ల కీడు వొస్తుందంటావా, అదేదో రానీ, ఏది ఎన్నుకోతగ్గదో చూసి అప్పుడే నిర్ణయించుకోవచ్చు."

భానుమూర్తికి దిమ్మ తిరిగింది. ఇక వీడితో వాదించి లాభం లేదు. మొండివాడు రాజుకన్నా బలవంతుడు! తన అపజయానికి కోపం, రోషం వొచ్చింది. కాని ఏం చేయగలడు? సుబ్బారావు ఆనందానికి అడ్డుపడలేడు కదా! అది చేయగలుగుతే, సుబ్బారావు తనంతట తానే మానుకుంటాడు.

ఇక మాట్లాడేందుకు మిగిలిందేమీ లేదు. బాగా పొద్దెక్కింది. ఒక పక్క ఆకలవుతోంది. మరోపక్క ఈ ఊళ్ళో ఉండటమే, అందులోనూ సుబ్బారావుతో గడపటం మరీ అసహ్యమనిపించింది. బలవంతుణ్ని ఎదుర్కొని ఓడటంకన్న, వాణ్ని తప్పించుకొని తోక ముడవటమే మంచిది.

"సరే, ఏమన్నా చావు... నేను మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లుతున్నాను" అన్నాడు భానుమూర్తి, లేచి నిలబడుతూ.

"ఇంటికి వెళ్ళి భోంచేసి వెళ్దువు కాని" అన్నాడు సుబ్బారావు. ఇంకో రోజు ఉండమని మొహమాటానికన్నా అనలేదని భానుమూర్తికి కష్టంగానే ఉంది. కాని ఏమీ అనలేక పొయ్యాడు.

"ఇప్పుడు మళ్లీ యీ మూడు మైళ్లు నడక దేనికి? హోటల్లో భోంచేస్తాను" అన్నాడు భానుమూర్తి.

"సరే-పా.. నేనూ హోటల్లోనే భోంచేస్తాను."

ఇద్దరూ లేచి నిలబడ్డారు. ఒకళ్ల మొహం మరొకరు చూసుకునేందుకే భయపడ్డారు. కాదు- ఏదో సిగ్గు వాళ్ళను దూర దూరానికి నెట్టింది. ఇద్దరు విరోధుల్నీ, మరో విరోధి ఒక్కసారిగా ఓడించినట్లయింది. ఎవ్వరూ మాట్లాడకుండానే, తలలు వొంచుకొని చకచకా నడవసాగారు.

## 2

మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్‌లో భానుమూర్తిని సాగనంపాడు సుబ్బారావు. రైలుతోపాటు తన మనశ్శాంతికూడా దూరతీరాలకు వెళ్లిపోయినట్లయింది. ఇతరుల అభిప్రాయాల్ని గూర్చి ఆలోచించటం అనవసరమనీ, యీ ప్రజాభిప్రాయాలకు తాను అతీతుడనీ ఇంతకుముందు తృప్తిపడ్డాడు కాని, ఇప్పుడు భానుమూర్తి అడిగిన నాలుగు మాటలూ హృదయంలో కలుక్కుమంటూనే ఉన్నవి.

ఇతరులకు జవాబులు చెప్పి తప్పించుకోవటం చాలా తేలిక. అవసరమైతే అబద్ధాలతో అతకవొచ్చు; కాని తనకు తాను జవాబు చెప్పుకోవటం ఎలా? అబద్ధమాడి ప్రపంచాన్నంతనూ మోసగించవొచ్చు. కాని, తనకు తను అబద్ధం చెప్పుకోవటం, మోసగించుకోవటం కుదరదే!

ఇన్నాళ్లు తను ఇతరుల్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాడు. కాని తనను తానెందుకు అర్థం చేసుకోలేదు? అద్దం ఉంటేనే కాని ఎవరి మొహం వాళ్లకు కనిపించదు. మిగతా అందరి మొహాలూ కనిపిస్తూనే ఉంటవి. పోతే, ఈ అద్దమనేదే ప్రపంచానుభవం అనుకొని, అందులో తనను తాను చూసుకోవటం జరిగి ఉండాల్సింది. ఐతే యీ అద్దం నిర్దుష్టమైనదో, కాదో తెలియదాయె!

మనస్సంతా వికలమైంది; హృదయభారం హెచ్చింది. హాయిగా బతికే వాడిని చూసి ఓర్చలేక, భానుమూర్తి గాయం చేసి వెళ్లాడు. దీన్ని మాన్పుకునేందుకు తన అవస్థ తాను పడాల్సిందే!

నీలవేణినీ, తన భార్యనూ పోల్చుకో సాగాడు. తనకు తెలుసు- నీలవేణి తన భార్యకన్నా ఏ విధంగానూ గొప్పది కాదు. కాకపోతే ఆరోగ్యం లేని తన భార్య ఇవ్వలేని ఆనందం కోసమే, యీ నీలవేణిని ఆశ్రయించాడు. కాని, ఆమె అంటే తనకు ప్రేమా, గీమా, ఆత్మ బంధనాలూ ఇత్యాది వేమీ లేవు. ఏదో అవసరానికి అడ్డం పెట్టుకున్నాడు- అంతే!

భానుమూర్తి అన్నట్లుగా తను తక్కువదానికోసం పరుగెత్తటమే జరుగుతోంది. తన అభిరుచులు దిగజారినయ్యా!- తన దృష్టి ఉన్నతాశయాల వైపు మళ్ళదు-

ఎందుకని? గత రెండేళ్ళనుంచే యీ నీలవేణి పొత్తు. నీలవేణికన్న మంచివాళ్లు ఉన్నారా, లేదా అనే ఆలోచనకూడా కలగ లేదు. ఇప్పుడిప్పుడే పైకి ఎగరాలనీ, తనింకా దుమ్ములో వున్నాననే - జ్ఞానం కలుగుతోంది. పై అంతస్తు అందుకోగలిగినా, లేకున్నా, తను కనీసం ప్రయత్నమన్నా చేయలేదు కదా!

సాయింత్రం దాకా బజార్లలో తిరుగుతూనే వున్నాడు. ఇంటికి పో బుద్ధి కాలేదు. ఇంటికి వెళ్లి భార్య మొహం చూసే సాహసం, అందులోనూ పగటివేళ ఆమె ఎదుటపడే ధైర్యం లేదు. అంతకు ముందెన్నడూ లేని కల్మషాత్మ ఘోష తలక్కిందులు చేస్తోంది...

చీకటి పడింది. మనశ్శాంతి కోసం సినిమాకు వెళ్ళాడు. కాని ఆ సినిమా కూడా ఏమీ బాగా లేదు. తన మనస్సులో జరిగే సినిమా ముందు, యీ బైటి సినిమా ఏ విధంగానూ తనను కదపలేదు. ఐనా యీ బాహ్య ప్రపంచంలో ప్రతి వినోదమూ మనశ్శాంతి నివ్వగలిగేదైతే, చాలామందికి యీ ప్రపంచం చాలా నివాసయోగ్యంగానే ఉండేది.

మరీ ఆ నాట్యాలు - ఏం నాట్యాలవి? స్త్రీత్వంలోని వొంపుల్ని చూపటం, ఎగిరెగిరి గంతులేస్తూంటే వక్షోజాలు కూడా నాట్యమాడటమే కాని - చిరాకు వేసింది సుబ్బారావుకు. మిగతా జనమంతా ఎలా ఆనందిస్తున్నారో? తమ నీచాభిరుచుల్ని తెలిసివుండీ, ఎలా ఆరాధిస్తున్నారో? రోతపుట్టి ఇంటర్‌వల్‌కే బైటపడ్డాడు.

బజార్లో ఒక పక్కగా ఒక యువతి నాట్యం చేస్తోంది. మరో యువకుడు మెడలో హార్మోనీ వేళ్ళాడేసుకొని వాయిస్తున్నాడు. వాడి పక్కనే ఒక ముసలివాడు మెడలో వేళ్ళాడేసుకొన్న తబలాల్ని మోగిస్తున్నాడు. కాళ్ళకు గజ్జెలు కట్టుకొని పాడుతూ నాట్యం చేస్తోందామె... సుబ్బారావుకూడా జనంలోంచి సందుచేసుకుని ముందుకు వెళ్ళాడు. నాట్యం బాగున్నట్లే తోచింది. ఇంతమంది జనం ఆనందిస్తున్నారంటే, ఇష్టమైతే ఒక కానీ ధర్మం చెయ్యవొచ్చు; లేకుంటే కని, విని, ఆనందించి, ఇంటికి పోవచ్చు!

-కాని సినిమాలో నాట్యంతో పోలుస్తే, ఇది ఏ విధంగా గొప్పది? ఆ సెట్టింగులా లేవు; ఆ దుస్తుల ధారణా లేదు; కళ్లకు ఇంపుగా వుండే దృశ్యీకరణ కాని, చీకటి వెలుగుల సమ్మేళనం కానీ లేదు; హాయిగా పరుపుల కుర్చీలలో పంకాలకింద కూర్చొని చూడటంకూడా కాదు; మనుషుల్ని రాసుకుంటూ అలాగే నిలబడి చూడాలి. ఇక సంగీతం కానీ, ఈ నాట్యంకానీ ఏ విధంగానూ సినిమాలోవాటితో సరితూగవు. యీ బోడి వాయిద్యాలు రెండూ, నాట్యకత్తె ఒక్కతేను... అక్కడో - సీతాకోక చిలకల్లాగు ఒక తండా తండా లంగాలు కట్టుకొని గిర గిర తిరుగుతూంటే, అనేక బుల్లి సర్కస్‌ల తాలూకు గుడారాలే బొంగరాలయ్యాయనిపిస్తవి... ఏది ఏమైనా సుబ్బారావు మాత్రం డబ్బిచ్చిన సినిమాలోని నాట్యంకన్న, యీ బజారు నాట్యాన్నే ఆనందించ గలిగాడు. ఇక్కడి సరదా అక్కడేది?

కాసేపు చూశాక, విసుగు పుట్టకపోయినా, ఎవరైనా ఎరిగినవాళ్లు చూస్తే బాగుండదని, తన అభిరుచుల్ని తానే దూషించుకుంటూ గుంపులోనించి మెల్లిగా బైటపడ్డాడు. ఆకలి వేస్తోంది; ఇంటికి వెళ్దామనుకున్నాడు కాని, కనీసం పది గంటలైనా కాందే వెళ్లేందుకు మనస్కరించలేదు... ఎదురుగుండా మిలటరీ హోటల్ కనిపిస్తోంది. రోజూ శాకాహారమే. ఇవాళ మార్పన్నా వుంటుందని హోటల్‌లోకి దూరాడు.

హోటల్‌నుంచి బైటకొచ్చేటప్పటికి తొమ్మిదిన్నరయింది. అలాగే నడుస్తూ, సింగు మిఠాయి కొట్టు దగ్గిరికి వొచ్చాడు. నీలవేణి ఇంటికివెళ్తూ. రోజూ ఇదే వేళ సింగు కొట్లో మిఠాయి కొనుక్కు వెళ్తూంటాడు. ఇవాళ సింగు చాలా తీరిగ్గా కూర్చున్నాడు. బేరం బాగాలేదేమో?

అటుపోవటం అనవసర మనుకున్నాడు కాని, సింగే పిలిచాక సుబ్బారావుకు పోక తప్పలేదు.

"కూర్చోండి–"

సుబ్బారావు కూర్చున్నాడు; సింగు వేరుసెనక్కాయలు పప్పులొలిచి తింటున్నాడు. కాసిని తీసి సుబ్బారావుకు యిచ్చాడు. "నాకొద్దు... ఇప్పుడే భోంచేశాను" అన్నాడు సుబ్బారావు.

సింగు త్వరత్వరగా తింటున్నాడు. చుట్టూ నేతి మిఠాయి ఘుమ ఘుమ లాడుతోంది. వేయించి వుప్పూ కారం చల్లిన జీడిపప్పులు, నోట్లో ఊటలూరిస్తున్నవి. మరోపక్క నోట్లో కెళ్తే కరిగేందుకు సిద్ధంగా వున్న పాల్‌కోవా పళ్లెం మెరుస్తోంది... ఇవన్నీ వుంటే, యీ సింగు వెధవ వేరుసెనక్కాయలు తినట మేమిటి?

"సింగూ!... నీ నేతి మిఠాయికన్న వేరుసెనక్కాయలు బాగుంటయ్యా?" అన్నాడు సుబ్బారావు.

"బాగుండవు–"

"మరి వేరుసెనక్కాయలు తింటావేం?"

"మిఠాయి రోజూ తినేదేగా!... విసుగెత్తింది... వేరుసెనక్కాయ లంటారా, వీటికన్న బాగుండకపోయినా, దాని రుచి దానిదే! తక్కువే అనుకోండి. వేరుసెనక్కాయ రుచి మిఠాయికీ లేదు. మిఠాయి రుచి వేరుసెనక్కాయలకూ లేదు... దేని ప్రత్యేకత దానిది!"

సుబ్బారావుకు చప్పున జ్ఞానోదయ మైనట్లయింది. తను ఏ ప్రశ్నకు జవాబు దొరక్క తన్నుకుంటున్నాడో, దాన్ని వేరొక సందర్భంగా, తినుబండారాల పరంగా సింగు విప్పి చెప్పగలిగాడు. సినిమాలో నాట్యంకన్న బజారు నాట్యం తక్కువదే అవుగాక– దాని ప్రత్యేకతా, సరదా దానికి వుంది. అదేవిధంగా హోటల్ భోజనం, ఇంటి భోజనంతో ఏవిధంగానూ సాటిరాదు; కాని రోజూ తినే ఇంటి భోజనంకన్న హోటల్ భోజనం

ఆకర్షిస్తుంది; ఇదే విధంగా హోటల్ భోజనంతో విసుగెత్తివున్నవాళ్లను ఇంటి భోజనం ఆకర్షిస్తుంది... దేనికి దేనితో పోలిక? పోలికలు కావు ఆకర్షించేవి- వాటి వాటి ప్రత్యేకతలు. మిఠాయి రుచీ, వేరుసెనక్కాయల రుచీ ఒక్కటే ఐతే యీ భేదం కనిపించదు కదా!

హఠాత్తుగా లేచి నిలబడ్డాడు సుబ్బారావు.

"మిఠాయి తీసుకొని వెళ్లరూ?" అన్నాడు సింగు.

సుబ్బారావు మాట్లాడలేదు; సింగు కట్టి యిచ్చిన పొట్లాలు పట్టుకొని బయలుదేరాడు. ఇప్పుడు ఇంటికెళ్ళి, వాళ్ళందర్నీ లేపటం దేనికి? ఈ రాత్రి నీలవేణితోనే గడిపేస్తే సరిపోతుం దనుకున్నాడు.

నీలవేణి ఇంటి తలుపు కొట్టాడు. తనకు విసుగెత్తాక కాని తలుపు తీయబడలేదు; నీలవేణి తల్లి ఎదురవటం మరీ మంటగా వుంది.

"రండి..." అని ఆహ్వానించింది ముసలిది. మాట్లాడకుండా పడకగదిలోకి వెళ్ళి కూర్చున్నాడు సుబ్బారావు. ముసలిది వొచ్చి "అమ్మాయి సినిమాకు వెళ్ళింది" అంది. జవాబేమీ రాకపోవటం వల్ల, ముసలిది వెళ్ళిపోయింది.

దీనికి సినిమా ఎందుకంట? సినిమాకే వెళ్ళిందో మరెక్కడికన్నా చచ్చిందో? ఎట్లాపోతే తనకేం? ఐనా తన ప్రాపకంలో వుంది కనుకనా తను దిగులు పడేందుకు?

తనింత మూర్ఖుడవుతున్నాడేమిటి? ఇంటి దగ్గర తనకోసం పడిగాపులు కాచే భార్యను వొదిలి, ఇక్కడ యీ గదిలో, ఆ వేశ్యకోసం ఎదురుతెన్నులు చూడట మేమిటి? నీలవేణి మీద ఎంత అసహ్యం కలుగుతూన్నట్లు తోచినా, వెళ్ళబుద్ధి కాలేదు. ఆలస్యమౌతూన్న కొద్దీ ఆతృత, దాంతో పట్టుదలా హెచ్చుతోంది. ఎలాగూ వ్రతం చెడ్డాడు కనుక, ఫలం దక్కించుకోవాలనే నిశ్చయంలో వున్నాడు. అలాగే క్షణమొక యుగంగా స్త్రీల వ్రతకథల దగ్గిర్నుంచీ, శూర్పణఖ సమర్తదాకా వున్న పుస్తకాలు చదివాడు. అవి వెధవ పుస్తకాలే ఐనా యీ క్షణంలో చదవగలిగాడు మరి!

ఒంటిగంట దాటినా నీలవేణి అంతులేదు. ఇది సినిమాకు పోయివుంటే యీ పాటికి వొచ్చేదికాదా? ఏమిటి ఈ అవస్థ? హాయిగా ఇంటికివెళ్లి పడుకున్నా సరిపొయ్యేదే! నీలవేణి రాగానే వొంగదీసి రెండు గుద్దులు గుద్దాలనిపిస్తోంది. కాని, అది ఏడుస్తూ కూర్చుంటే, రసికత్వాన్ని ప్రదర్శించేందుకు మారుగా దాన్ని ఊరడించాల్సి వొస్తుంది...

చివరకు మూడింటికి నీలవేణి వొచ్చింది. అవతారం చూడగానే సుబ్బారావుకు అనుమానం వేసింది. చక్కగా అలంకరించుకొని సినిమాకు వెళ్ళొస్తే, ఇది ఇలా వుంటుందా? కోపం రగిలిపోతోంది. కాని, ఏమనేందుకూ తోచటం లేదు.

"వొస్తున్నానని కబురన్నా లేకుండా వొచ్చారేం?" అంది నీలవేణి రేగిన జుట్టును గోళ్లతో సరిజేసుకుంటూ.

"ఎక్కడి కెళ్ళావ్?" అన్నాడు సుబ్బారావు, సాధ్యమైనంత కోపాన్ని ప్రదర్శిస్తూనే.

"సినిమాకు" అందామె.

కాదని తను తేలిగ్గా రుజూ చేయగలిగినా అయేదేమీ లేదు. పైపెచ్చు "నా యిష్టం!" అని కనుక నీలవేణి అంటే, తను తెల్లమొహం వేయాల్సి వొస్తుంది. ఇంకెవరి కోసమో ఇది వెల్లిందంటే, తనకు మరీ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇలా అనేకులచేత కోరబడటం వల్లే వస్తువు నాణ్యంగా పరిగణించ బడుతోందేమో? ఇంతసేపూ కాచుకొనివుండి, ఇప్పుడు అనవసరపు రభస ప్రారంభించటం దేనికి? తెలిసివుండీ తను నీలవేణిని కోరాడు. యీమె పాతివ్రత్యాన్ని గూర్చి తనెన్నడూ ఆలోచించ లేదు. ఇప్పుడు ఆలోచించటంలో అర్థం లేదు. డిమాండ్ ఎక్కువగావున్న సరుకు విలువ గలదిగానే తోచటంలో ఆశ్చర్య మేమిటి?

"ఏమిటలా చూస్తారు? నాకు నిద్దరొస్తోంది" అంది నీలవేణి ఆవలిస్తూ.

"కాస్త మిఠాయితిను..." అన్నాడు సుబ్బారావు. బతిమాలో భంగపడో ఆమెను ప్రసన్నురాల్ని చేసుకోకతప్పదు మరి.

మిఠాయితిని, మంచినీళ్ళు తాగాక అలసిన తన శరీరాన్ని సుబ్బారావు చేతుల్లో వాల్చింది నీలవేణి. ఏదో నైచ్యాన్ని భరిస్తున్నా ననిపించిందతనికి. "ఛీ – ఛీ" అనుకుంటూనే నీలవేణిని దగ్గిరికి లాక్కున్నాడు. వాడిన మల్లెలవాసన వికారంగానే వుంది. తనను తను నిందించుకున్నా అసహ్యించుకున్నా సుబ్బారావు శరీరం లొంగిపోయింది.

"రేపు చెపుతాను దీని సంగతి; రేపటినుంచీ యీ ఛాయలకే రాకూడదు" అనుకున్నాడు సుబ్బారావు. యీ జవాబు చాలా తృప్తికరంగా తోచిం దతనికి. నీలవేణి రసికత్వాన్ని పొందే తాపత్రయంలో, అంతరాత్మను మరి మాట్లాడనివ్వలేదతను.

–కాని, రేపు అనేది వేరొకరోజు. ఎవరు రాజో, ఎవరు రెడ్డో ఎవరికి తెలుసు?